మార్చి 6 నుంచి ఉమామహేశ్వర ఆలయ వార్షికోత్సవం

ముస్తాబవుతున్న ఆలయం


ముస్తాబవుతున్న ఆలయం పరిసరాలు


ఆలయంలో కొలువుదీరిన శివయ్య

సుభాష్‌నగర్: సూరారం ఉమామహేశ్వర కాలనీలోని ఉమామహేశ్వరాలయం వార్షికోత్సవానికి ముస్తాబవుతోంది. మూడు దశాబ్దాలుగా ప్రతి ఏడాది ఆలయ వార్షికోత్సవాన్ని ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. మార్చి 6వ తేదీ 10గంటలకు ఉత్సవాలు ఆరంభమవుతాయి. సంవత్సరంలో ఒక్కరోజు మాత్రమే భక్తులకు గర్భగుడిలోకి వెళ్లి స్వయంగా అభిషేకం చేసుకునే అవకాశం కలుగుతుంది. అదే రోజు సాయంత్రం ఉమామహేశ్వర కల్యాణం, 7వ తేదీ ఉదయం 10గంటలకు రుద్రాభిషేకం, సాయంత్రం 6గంటలకు స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, 8వ తేదీ ఉదయం 4గంటలకు అభిషేకాలు, 10గంటలకు రుద్రాభిషేకం, భస్మాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయి. సాయంత్రం 6గంటల నుంచి భజన, సంస్కృతిక కార్యక్రమాలు తెల్లవారుజాము వరకు జాగరణ చేసే భక్తులకు రాత్రి 12గంటలకు లింగోద్భవ మహాపూజ కార్యక్రమం ఉంటుందన్నారు. ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులకు 9వ తేదీ ఉదయం 10.30గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అన్నదానం, 10వ తేదీ సాయంత్రం స్వామి వారి పవళింపు సేవ ఉంటుందన్నారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ చైర్మన్ ముద్దాపురం మదన్‌గౌడ్ తెలిపారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి



చింతల్: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కార్యాలయంలో అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో కుత్బుల్లాపూర్ ప్రాంతంలో ఎక్కడా నీటి సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. వేసవిలో అన్ని సెక్షన్ల పరిధిలో నీటి అవసరాలు దృష్ట్యా నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందన్నారు. ఎక్కడ చిన్న లీకేజీ తలెత్తినా అప్పటికప్పుడే స్పందించి చర్యలు తీసుకొని పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. తీవ్రమైన సమస్య ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా వాటర్ ట్యాంకర్ల ద్వారా బస్తీలకు, కాలనీలకు నీటిని సరఫరా అందించాలని మేనేజర్లకు సూచించారు.

◆ సెక్షన్ల పరిధిలో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పైపులైన్ పనులు చేపట్టే ప్రాంతాల్లో ఎటువంటి ప్రమాదాలు తలెత్తకుండా కాంట్రాక్టర్లు రక్షణ పరికరాలు, రిబ్బన్, హెచ్చరిక బోర్డులు తప్పనిసరిగా కట్టాలన్నారు. కొంతమంది చిన్నచిన్న పని లేక దాన్ని తవ్వి ఎటువంటి హెచ్చరిక బోర్డు చేయకుండానే చేపట్టడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాజేష్, అప్పలనాయుడు, విష్ణు ప్రసాద్, సెక్షన్ మేనేజర్లు రాజు, పూజిత, శివప్రసాద్, రోహిణి, రమ్య భారతి, అనూష, రవి తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్


ఏపీహెచ్‌బీ కాలనీలోని పార్కును పరిశీలిస్తున్న జెడ్‌సీ అభిలాష, డీసీ నరసింహ

రంగారెడ్డినగర్: పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ వాటిల్లో మౌలిక సదుపాయాలు, గ్రీనరీ, ప్లేగ్రౌండ్ల ఏర్పాట్లకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉపకమిషనర్ నరసింహతో కలిసి ఆమె రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని పార్కు-1, 2లను సందర్శించి స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు ఏర్వ సాయికిరణ్ పార్కుల్లో గ్రీనరీ లేని ప్రాంతంలో మొక్కలు నాటించాలని కోరారు. చిన్నారులు ఆడుకునేందుకు ప్లేగ్రౌండ్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. దీనిపై జెడ్‌సీ సానుకూలంగా స్పందించారు. అక్కడే ఉన్న ఉద్యానవన శాఖ అధికారులను ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిందిగా కమిషనర్ ఆదేశించారు.

నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి


ఎంఈవో ఆంజనేయులుకు వినతి పత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలను నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో యాజమాన్యాలు చెలగాటమాడుతున్నాయని ఏబీవీపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ నాగేష్ అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పలు ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఎంఈవో ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. నాగేష్ మాట్లాడుతూ.. ఇంటర్నేషనల్, వరల్డ్, గ్లోబల్, కిడ్స్, మోడల్, ప్లేస్కూళ్ల పేరుతో ఏర్పాటు చేసిన చాలా పాఠశాలలకు పర్మిషన్లు లేవన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలను ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారని అన్నారు. అడ్మిషన్ల కోసం అడ్వర్టైజ్‌మెంట్ల ఖర్చు పెడుతున్నారని ఆరోపించారు. సదరు పాఠశాలలను గుర్తించి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చింతల్ నగర సంయుక్త కార్యదర్శి సాయి, పృథ్వీ, తేజ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం


పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు సమష్టిగా పని చేసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బుధవారం సూరారం డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే ఉచిత బస్సు సదుపాయం పథకంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రానున్న కొద్ది రోజుల్లో అన్ని పథకాలను పూర్తిగా అమలు పరిచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ల్యాబ్ ఆధారిత విద్య అందించేందుకు కృషి


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వైస్ ప్రెసిడెంట్ కవితా నాగ్‌పాల్, ప్రిన్సిపాల్ తబస్సుమ్ జైదీ

దుండిగల్: విద్యార్థులకు ప్రాక్టికల్ ఎక్సర్‌సైజ్ సమకూర్చడానికి, ల్యాబ్ ఆధారిత విద్యను అందించడానికి ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం కృషి చేస్తోందని ఆర్కిడ్స్ అకడమిక్స్ వైస్ ప్రెసిడెంట్ కవితా నాగ్పాల్ అన్నారు. బుధవారం భౌరంపేట్‌లోని ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇమాజిన్ హబ్ ల్యాబ్‌ను ఐఏఎస్ అధికారి భారతి లక్పతి నాయక్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కవితా నాగ్‌పాల్ మాట్లాడుతూ.. ఇమాజిన్ ల్యాబ్‌లో ఆస్ట్రోనమీ, రొబోటిక్స్, ఎంపీసీ కోడింగ్, టింకరింగ్, డాన్స్, థియేటర్, మ్యూజిక్, పోటరీ, పెయింటింగ్ వంటివి అందుబాటులో ఉంటాయని అన్నారు. ఇది విద్యార్థుల ఉజ్వల కెరీర్‌కు దోహద పడుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తబస్సుమ్ జైదీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షలు సజావుగా నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఇంటర్, పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు-2024కు సంబంధించి డీఐవో కిషన్, డీఈవో విజయకుమారితోసహా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో అధికారులు సమన్వయంతో తమ విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలకు 139 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రథమ సంవత్సరంలో 65,965 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరానికి 65,495 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9. నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

పదో తరగతి పరీక్షలు ఇలా..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరుగుతాయని జిల్లా అదనపు కలెక్టర్ తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు సంబంధించి 231 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఉంటాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 47406 (రెగ్యులర్ 46834, ప్రైవేట్ 572) మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూం నుంచి పరీక్షా కేంద్రానికి, పరీక్షా కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూంకు ఎగ్జామ్ మెటీరియల్ తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్షలు నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేయాలని కోరారు. పరీక్షా కేంద్రాల నుంచి జవాబు పత్రాలను పకడ్బందీగా తీసుకువెళ్లేందుకు పోస్టల్ శాఖ సహకరించాలన్నారు.విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు అనుమతి లేదని అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్షలను పారదర్శకంగా విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు,రాచకొండ,సైబరాబాద్ పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

24న కబడ్డీ పురుషుల జట్టు ఎంపిక

నిజాంపేట్: ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్ పోటీలకు ఈనెల 24న బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీలో మేడ్చల్ జిల్లా సీనియర్ పురుషుల జట్టు ఎంపిక ఉంటుందని తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సెక్రటరీ జగదీశ్వర్ యాదవ్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 2 నుంచి 4వ తేదీ వరకు నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనదలిచే అభ్యర్థులు 24వ తేదీ మధ్యాహ్నం 2.30గంటలకు బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీకి చేరుకోవాలని నిర్వాహకులు కోరారు. ఔత్సాహికులు స్థానికంగా ఉంటూ, 85 కిలోల బరువు కలిగి ఉండాలని, ఆధార్‌తో పాటు రెండు పాస్‌ఫోర్ట్ సైజు ఫొటోలు తేవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నేతాజీనగర్‌లో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఉప్పరి శేఖర్‌సాగర్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్, కోశాధికారి రామేశ్వరంరెడ్డి, ఉపాధ్యక్షులు మల్లేశం ముదిరాజ్, ప్రతినిధులు మహేష్ కురుమ, సంతోష్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆరోగ్య కేంద్రం

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో నాదెళ్ళ లక్ష్మయ్య మెమోరియల్ ఆరోగ్యం కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. అవుట్ పేషంట్‌కు రూ.30లు చెల్లించాలి. ప్రతి రోజు సుమారు 25 మంది రోగులకు వైద్య పరీక్షలు అందిస్తారు. వైద్య పరీక్షలు చేసిన వారికి ఉచితంగా మందులు, మైనర్ ఆపరేషన్లు కూడా ఆరోగ్యం కేంద్రంలో నిర్వహిస్తారు.

ఫలహారం బండి ఊరేగింపు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల గొల్లగూడెం గ్రామంలో బుధవారం రెండో రోజు మల్లిఖార్జున స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులు కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో ఫలహారం బండి ఊరేగింపు చేపట్టారు. ఇందులో భాగంగా పోతరాజులు, మేకపోతుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, నాయకులు శంకర్‌యాదవ్, విజయ్‌కుమార్, సత్యనారాయణ, ఆకుల నవీన్, గడ్డె నర్సింహ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ సర్వే నంబర్ 297లో అక్రమంగా నిర్మించిన సుమారు 15 ఇళ్లను రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ విశ్వేశ్వర్, ఆర్ఐ శ్రీకాంత్ పోలీసుల సహకారంతో కూల్చివేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

లాన్ టెన్నిస్ విజేత బిట్స్ పిలానీ హైదరాబాద్ జట్టు


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మహేంద్ర యూనివర్సిటీ వీసీ యాజుల మెదురి


లాన్ టెన్నిస్‌లో విజేతగా నిలిచిన బిట్స్ పిలానీ జట్టు సభ్యులు

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని మహీంద్రా విశ్వవిద్యాలయంలో ఐరో, ఈథర్ పేరిట వార్షిక క్రీడలు, టెక్నో సాంస్కృతిక మహోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఏడు రోజుల జరిగిన ఈ ఉత్సవాలలో క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, లాన్ టెన్నిస్, అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. అదే విధంగా సాహిత్య చర్చలు, క్విజ్‌లు, స్టాండ్-అప్ కామెడీ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షణగా నిలిచాయి. బిట్స్ పిలానీ హైదరాబాద్ జట్టు లాన్ టెన్నిస్‌లోని రెండు సింగిల్స్ టోర్నమెంట్‌లను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా మహీంద్రా యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ యాజులు మెదురి మాట్లాడుతూ... ఈ ఉత్సవాలు విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయడానికి దోహదపడతాయని అన్నారు. విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన విద్యార్థులు, అధ్యాపకులు ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి, సహకరించుకోవడానికి శక్తివంతమైన కేంద్రాలుగా పని చేస్తాయన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం


పూజలో పాల్గొన్న కార్పొరేటర్ రావుల శేషగిరి

సుభాష్‌నగర్: ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. బుధవారం ఎన్టీఆర్‌నగర్-ఏలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓంకారేశ్వర శివవీరాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ కమిటీ ఆయన్ని సత్కరించింది. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు విజయ్‌రామ్‌రెడ్డి, నాయకులు కస్తూరి బాలరాజు, పెద్దబాల అంజన్‌గౌడ్, ఇబ్రాహీం, చిన్నగౌడ్, సుంకరి శివముదిరాజ్, పీర రెడ్డి, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దాసాంజనేయ ఆలయ వార్షికోత్సవం


దాసాంజనేయ సహిత మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: భౌరంపేట్‌లోని దాసాంజనేయ సహిత మల్లికార్జునస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో కౌన్సిలర్లు వనిత బుచ్చిరెడ్డి, నాచారం సునితమురళి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన జాతరకు ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్‌రాజు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, దుండిగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు అర్కల అనంతస్వామి, జక్కుల కృష్ణ యాదవ్, ఆనంద్, జక్కుల శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, బౌరంపేట్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, నాయకులు విజయ్‌రామ్‌రెడ్డి, ఎంబరి ఆంజనేయులు, బైండ్ల గోపాల్, కామేష్, సోమరాజు, నర్సింహా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన రోడ్డు పనులు

కిలోమీటర్ మేర నిలిచిపోయిన ట్రాఫిక్

సుభాష్‌నగర్: దూలపల్లి చౌరస్తా నుంచి బహదూర్‌పల్లి చౌరస్తా వరకు రోడ్డు పనులు నత్తనడకన జరుగుతున్న నేపథ్యంలో నిత్యం ఉదయం సాయంత్రం వేళలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. బుధవారం ఉదయం నుంచి సుమారు 10గంటల వరకు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఇతర యువకులు గంట పాటు శ్రమించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. రోడ్డు పనులు తొందరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. రోడ్డు పనులు అయ్యేంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సిబ్బందిని నియమించి వాహనాలు ఆగకుండా చూడాలని సంబంధిత అధికారులకు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



భాష, సంస్కృతి ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి

గచ్చిబౌలి: నీతి, నిజాయితీ, మంచి నడవడిక నేర్పేది మాతృభాషయేనని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి వారిజారాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి డివిజన్‌లోని కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ టి రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి భాషలేనిదే మానవజాతికి వికాసం లేదని, అన్యభాషలు ఎన్ని నేర్చుకున్నా మాతృభాషలో ప్రావీణ్యుడు కాలేనివాడు విజ్ఞాన సముపార్జన చేయలేడని స్పష్టం చేశారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన తల్లి భాష నేడు తల్లడిల్లుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రపంచ వ్యాప్తంగా వేల కొలది మాతృభాషలు కనుమరుగయ్యే పరిస్థితులు ఉన్నాయంటూ యునెస్కో హెచ్చరిస్తుందని గుర్తుచేశారు. ప్రపంచీకరణ వలన ప్రపంచమంతా మనకు దగ్గరవుతుండగా మన భాష మాత్రం మనకు దూరమువతుందన్నారు. భాష, సంస్కృతులు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయని, కాబట్టి మారుతున్న మన సంస్కృతితోపాటు మన భాష కూడా మార్పులు చెందుతూ ఉంటుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు పల్లె అనంతరెడ్డి, ఉపాధ్యాయులు నాగలక్ష్మీ, పుష్పలీల, స్వాతి, అసోసియేషన్ సభ్యులు వాణి సాంబశివరావు, శ్రీనివాస్, జనార్దన్, శివరామకృష్ణ, అమ్మయ్యచౌదరి విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మహిళల మద్దతు అవసరం

రాయదుర్గం: ఏ సమాజం అభివృద్ధి చెందాలన్నా మహిళల మద్దతు వసరమని 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ సహకారంతో ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ ఆధ్వర్యంలో 'భారతదేశం లో ఉమెన్స్ మార్జినలైజేషన్ యొక్క డైనమిక్స్ ఎక్స్‌ప్లోరింగ్-చాలెంజెస్ అండ్ ప్రాస్పెక్ట్స్' అంశంపై రెండు రోజుల జాతీయస్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళల మినహాయింపు, వివక్ష గురించి అధ్యయనం చేయడం ప్రస్తుత తరుణంలో ఎంతో అవసరముందన్నారు. అనంతరం సెమినార్‌లో 25కు పైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు.

'డిజిటల్ ఇండియా'పై వర్క్‌షాప్

పటాన్‌చెరు: గ్రామీణ ప్రాంతాలలో డిజిటల్ ఇండియా ప్రభావం, తెలంగాణలో అన్వేషణాత్మక అధ్యయనం అనే అంశంపై గీతం విశ్వవిద్యాలయం ఒక రోజు వర్క్‌షాప్‌ని నిర్వహించినట్టు ప్రాజెక్టు డైరెక్టర్, గీతం అధ్యాపకుడు డాక్టర్ గుర్రం అశోక్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) సౌజన్యంతో దీనిని నిర్వహించినట్టు తెలిపారు. అట్టడుగుస్థాయిలో డిజిటల్ ఇండియాపై విధాన పరిశోధన ఆవశ్యకతను వివరించారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం

రాయదుర్గం: బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా గోపన్‌పల్లిలో పండగ వాతావరణం నెలకొంది. బుధవారం ఉదయం బొడ్రాయికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గోపన్‌పల్లివాసులంతా బొడ్రాయిని దర్శించుకొన్నారు. ఉత్సవంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్

పటాన్‌చెరు టౌన్: ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సమర్థవంతంగా రీ సైకిల్ చేయడం ద్వారా మానవాళిని ప్రమాదాల బారి నుంచి కాపాడవచ్చని టాస్క్ ట్రైనర్ సుప్రియ అన్నారు.బుధవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యంలో వేస్ట్ మేనేజ్‌మెంట్ అవేర్‌నెస్ సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... ఎలక్ట్రానిక్ పరికరాల ఉపయోగం పెరుగుతున్న కొద్దీ వాటి వ్యర్థాల వలన కలిగే భారీ నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు .కళాశాల కోఆర్డినేటర్ ఆర్ కృష్ణ , ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

38 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది .ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం....సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 38 మందిని పట్టుబడగా వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 38 మందికి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

హఫీజ్‌పేట్: చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అదృశ్యమైన బాలుడు సాత్విక్ బుధవారం ఆచూకీ లభించింది. లింగంపల్లి పరిసర ప్రాంతాలలో సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు లింగంపల్లి మార్కెట్‌లో తిరుగుతూ కనిపించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బాలుడు సాత్విక్‌ను తీసుకొచ్చి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సీఐ పాలవెల్లి సాత్విక్‌ను తల్లిదండ్రులైన కుమారస్వామి, సమతలకు అప్పగించారు. బాలుడి ఆచూకీని కనుగొన్న పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ కార్మికుడు మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడలోని సిఎంహెచ్ లాబొరేటరీస్ పరిశ్రమలో 13వ తేదీన పరిశ్రమలో కార్మికులు పనిచేసే చోట పేలిన ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒరిస్సాకు చెందిన మొంటు మాలిక్ (27) మంగళవారం రాత్రి మృతి చెందాడు సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్‌కు వెళ్తున్నానని చెప్పి..

పటాన్‌చెరు టౌన్: హోటల్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వెస్ట్ బెంగాల్ కు చెందిన సుభాష్ ముడీ, తుంపపాత్ర(25) బతుకుదెరువు కోసం రెండు నెలల క్రితం పటాన్‌చెరు మండల పరిధిలోని పాశమైలారంలో ఉంటున్నారు. సుభాష్ ముడీ ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తుండగా, అతడి భార్య తుంప పాత్ర పాశమైలారంలోని వాసుదేవ హోటల్లో పని చేస్తోంది. ఈ క్రమంలో రోజు మాదిరిగానే మంగళవారం హోటల్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన తుంబ పాత్ర హోటల్‌కి వెళ్లి అక్కడి నుండి చెప్పకుండా వెళ్ళిపోయింది.దీంతో సుభాష్ తన భార్య కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు.బుధవారం భార్య అదృశ్యంపై భర్త సుభాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.